## జిల్లా కోర్టులో నేషనల్ లోక్ అదాలత్

**వికారాబాద్, జూన్ 20, ప్రభాతవార్త:**
జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు సముదాయంలో నిర్వహించిన నేషనల్ లోక్ అదాలత్ కార్యక్రమం అత్యంత ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రిన్సిపల్, సెషన్ జడ్జ్ ఎం.నాగరాజు ముఖ్యఅతిథిగా, జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహామెహ్రా, గౌరవఅతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా జడ్జ్ ఎం.నాగరాజు మాట్లాడుతూ, లోక్ అదాలత్ ద్వారా వివాదాలను త్వరితగతిన పరిష్కరించుకోవడం సాధ్యమవుతుందని, కార్యక్రమాన్ని విజయవంతంచేయడంలో పోలీస్‌శాఖ అందిస్తున్న సహకారం అభినందనీయమని ఆయన కొనియాడారు. ఎస్పీ స్నేహా మెహ్రా మాట్లాడుతూ, పోలీస్‌శాఖ ఎల్లప్పుడూ న్యాయవ్యవస్థకు పూర్తిస్థాయిలో సహకరిస్తుందని తెలిపారు. అనంతరం ముఖ్య అతిథుల సమక్షంలో లోక్ అదాలత్ ద్వారా రాజీ కుదుర్చుకున్నవారికి సంబంధించిన తీర్పుకాపీలను అందజేశారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీస్ అధికారులు, కోర్టుసిబ్బంది పెద్దసంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు.



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

## బిసి కళాశాల హాస్టల్ వార్డెన్‌ను వెంటనే సస్పెండ్ చేయాలి

**-ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్‌కుమార్**

**చేవెళ్ల, జూన్ 20, ప్రభాతవార్త:**
భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఈరోజు బిసి కళాశాల హాస్టల్‌ను సందర్శించి విద్యార్థుల సమస్యలను తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ హాస్టల్‌వార్డెన్ విధులపట్ల పూర్తిగా నిర్లక్ష్యంవహిస్తున్నారని ఆరోపించారు. ఉదయం 10 గంటలు దాటినా విద్యార్థులకు అల్పాహారం అందించడం లేదని, దీనివల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. హాస్టల్‌లో సరైన వసతులు లేకపోవడం, వార్డెన్ నిర్లక్ష్యవైఖరి కారణంగా కొత్తగా చేరే విద్యార్థులు వెనుదిరిగే పరిస్థితి ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. విధులపట్ల నిర్లక్ష్యంవహిస్తున్న వార్డెన్ వెంటనే సస్పెండ్‌చేయాలని డిమాండ్‌చేశారు. విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యంచేస్తే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ 'నవీన్‌కుమార్' దారెటు..!?

**-బిఆర్ఎస్‌లో ఒంటరి పోరాటమా..!?**
**-షాద్‌నగర్‌లో పార్టీ కార్యక్రమానికి దూరంపై చర్చ**
**-మాజీ ఎమ్మెల్యే అంజయ్యతో ఇంకా సమసిపోని వివాదం..?**



సమావేశంలో మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

**షాద్‌నగర్, జూన్ 20, ప్రభాతవార్త:**
అస్త్రం ఉంది, లక్ష్యం ఉంది, మొక్కవోని దీక్ష ఉంది, గుండె నిండా దమ్ము ఉంది.. బిఆర్ఎస్ పార్టీకి మంచి బలమైన నాయకుడు ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి. కాని స్థానికరాజకీయాల్లో ఆయన పొసగలేకపోతున్నారా? అంటే అవుననే అంటున్నాయి పార్టీవర్గాలు. ప్రస్తుతం షాద్‌నగర్ రాజకీ యాల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అభివృద్ధి మంత్రంతో నియోజకవర్గంలో తన స్థాయిని పరపతిని పెంచుకుంటున్నారు. అయితే ప్రతిపక్ష నేతలు మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్, ప్రస్తుత ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిల మధ్య విభేదాలు ఉండడంతో కాంగ్రెస్ పార్టీకి బాగా కలిసి వచ్చే కాలం అని చెప్పవచ్చు. చివరకు మళ్ళీ బిఆర్ఎస్ విభేదాలు కనిపించాయి. దీంతో సామాన్యకార్యకర్తలు దీనిపై చర్చించుకుంటున్నారు. విషయం ఏమిటంటే? షాద్‌నగర్ నియోజకవర్గాల్లో మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌ది ప్రత్యేక రాజకీయశైలి. అదేవిధంగా అదే పార్టీకి చెందిన యువనాయకుడు ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిది కూడా విభిన్నశైలి. వీరిద్దరి మధ్య రాజకీయ విభేదాలు పొడచూపడం, ఈవివాదం సాక్షాత్తు పార్టీ అధినేత కెటిఆర్ వద్దకు చేరుకోవడం గతంలో జరిగిపోయాయి. ఆసందర్భంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఏకంగా నియోజకవర్గానికి అంజయ్యయాదవ్ నాయకత్వమే ఫైనల్ అంటూ ఆదేశాలు జారీచేశారు. నవీన్ రెడ్డికి ఉడుకురాజకీయాలు వద్దంటూ హైకమాండ్ ఆదేశాలు ఇచ్చారు. ఆనాటినుండి నియోజకవర్గ బిఆర్ఎస్ రాజకీయాల్లో నవీన్‌రెడ్డి ఎక్కడ అంజయ్యతో కలిసి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనలేదు. గత బుధవారం షాద్‌నగర్‌లో బిఆర్ఎస్‌పార్టీ ముఖ్యమైన సమావేశాన్ని నిర్వహించింది. మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ ముఖ్యమైన కార్యక్రమానికి మాజీమంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ సురభి వానిదేవి అదేవిధంగా పార్టీ ఇంచార్జ్ బైకానిక్ శ్రీనివాస్‌యాదవ్ తదితర శ్రేణులు హాజరయ్యారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి హాజరు కాకపోవడం పట్ల పార్టీవర్గాల్లోనే చర్చ జరిగింది. ఇంత పెద్ద కార్యక్రమానికి నవీన్ కుమార్‌రెడ్డి గైర్హాజరు కావడం పట్ల మరోసారి నియోజకవర్గంలో రాజకీయంగా చర్చకు ఆస్కారం ఏర్పడింది. అసలు ఆయనకు ఆహ్వానం ఉందా లేదా అన్నది కూడా అనుమానమే. నవీన్‌రెడ్డి రాజకీయాల్లో స్థానికంగా ఒంటరి అయ్యారా అన్న అనుమానాలు కూడా కార్యకర్తలు వ్యక్తంచేస్తు న్నారు. విభేదాలు వీడి కలిసికట్టుగా శ్రమిస్తే బిఆర్ఎస్ పార్టీకి మళ్లీ భవిష్యత్తు ఉంటుందనేది సామాన్య కార్యకర్తల అభిప్రాయం. రాబోయే ఎన్నికల్లో ఎవరు పోటీచేస్తారు అన్నది పక్కనపెడితే కాంగ్రెస్ పార్టీని ఎలా ఎదుర్కోవాలి అన్నది ఈ ఇద్దరు నాయకులు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో నవీన్‌రెడ్డి పార్టీ కార్యక్రమాలకు స్థానికంగా దూరంగా ఉంటే ప్రజలకు పార్టీ కార్యకర్తలకు వేరేవిధంగా సంకేతాలు వెళ్లే ఆస్కారాలు లేకపోలేదు. అగ్రనాయకత్వం నియోజకవర్గ రాజకీయాలపై దృష్టి సారిస్తే అంతా మంచే జరుగుతుందని భావిస్తున్నారు. ఇలా వదిలేస్తే రానురాను పరిస్థితుల్లో మార్పు జటిలం అవుతుందని కార్యకర్తలు భావిస్తున్నారు. ఉప్పును, నిప్పును ఏకంచేసే మార్గం అధిష్ఠానం ఆలోచిస్తే బాగుంటుందని నియోజకవర్గ రాజకీయాల్లో అభిప్రాయం వ్యక్తం అవుతుంది.

## కాంగ్రెస్ రైతు హామీలన్నీ మోసాలే..

**-చేవెళ్ళలో బిఆర్ఎస్ నేతల తీవ్ర ఆగ్రహం!**



సమావేశంలో మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు

**చేవెళ్ల, జూన్ 20, ప్రభాతవార్త:**
చేవెళ్ళ మండలకేంద్రంలో ఈరోజు బిఆర్ఎస్‌పార్టీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా తెలంగాణ రాష్ట్ర విద్యా సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ నాగేందర్‌గౌడ్, రంగారెడ్డి జిల్లా మాజీ డిసిఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి, చేవెళ్ళ నియోజకవర్గ మాజీ ఇన్చార్జి దేశమల్ల ఆంజనేయులు, మండల అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్ అనంత్‌రెడ్డి సంయుక్తంగా మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభమై రైతాంగం సాగుపనుల్లో మునిగిపోయినా, కాంగ్రెస్ ప్రభుత్వం ఎరువులు, విత్తనాలు అందించడంలో ఘోరంగా విఫలమైందని వారు మండిపడ్డారు. భరోసా, కౌలురైతుల నిధులు, వరి బోనస్ సొమ్మును ఎటువంటి ఆంక్షలు లేకుండా వెంటనే వర్తింపజేయాలని బిఆర్ఎస్ నేతలు డిమాండ్‌చేశారు. లేనిపక్షంలో రైతులను ఏకంచేసి, బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేవెళ్ళ నియోజకవర్గవ్యాప్తంగా పెద్ద ఎత్తున ధర్నాలు, ఆందోళనలు చేపడతామని వారు ప్రభుత్వాన్ని గట్టిగా హెచ్చరించారు. సమావేశంలో చేవెళ్ళ మండల అధ్యక్షుడు పెదోళ్ళ ప్రభాకర్, మొయినాబాద్ మండల అధ్యక్షుడు వెంకటరెడ్డి, నవపేట్ మండల అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు మల్లేష్, సువర్ణచందు, నాయకులు తలారి యాదయ్య, గోపాల్, కృష్ణ, బేగరి నర్సింలు, కరుణాకర్‌రెడ్డి, వేంకటేశ్వరరెడ్డి, రంగారెడ్డి, సుదర్శన్, రాంప్రసాద్, వెంకటేష్, మాధవ్‌రెడ్డి, ఉపేందర్, పృథ్వి, మహేష్, రవికుమార్‌లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా నిర్వర్తించాలి

**-జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి**
**-చేవెళ్ల మండలంలోని రావుపల్లి, మీరగూడ గ్రామాల్లో పర్యటన**



గ్రామంలో పర్యటిస్తున్న అదనపు కలెక్టర్ కిరణ్మయి

**చేవెళ్ల, జూన్ 20, ప్రభాతవార్త:**
ప్రభుత్వం నిర్వహిస్తున్న పథకాలను గ్రామాల్లో సమర్థవంతంగా నిర్వర్తించాలని జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి తెలిపారు. శనివారం చేవెళ్ల మండలంలోని మీరగూడ, రావులపల్లి గ్రామాల్లో జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఉన్న పల్లె ప్రకృతివనాలు, ప్రభుత్వ అంగన్‌వాడీ భవనాలు, నర్సరీలు, ప్రభుత్వ పాఠశాలలు, చెత్త డంపింగ్ యార్డులను స్వయంగా పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రభుత్వం నిర్వహిస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వర్షాకాలం కావడంతో గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేరుచేసి చెత్తబండిలో వేయాలన్నారు. ప్రభుత్వం ఆదేశించిన పనులను సమర్థవంతంగా నిర్వర్తించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం చేపట్టిన పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. రావులపల్లి, మీరగూడ గ్రామాల్లో పనుల నిర్వహణపై అదనపు కలెక్టర్ సంతృప్తి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఎంపిడివో బన్సీలాల్, ఎంపివో విఠలేశ్వర్, సర్పంచులు రాంచంద్రయ్యగౌడ్, సుస్మిత, అధికారులు, గ్రామస్థులు ఉన్నారు.

# సమర్థులకు బదిలీ నజరానా

**పోలీసుశాఖలో లుకలుకలు**
**నలుగురిలో ఒకరి బదిలీకి తాత్కాలిక బ్రేక్**

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి:**
ఇటీవల పోలీసుశాఖలో సమర్థులైన సిబ్బందిని బదిలీ చేయడం సర్వత్రా చర్చనీయంగా మారింది. క్రైమ్ విభాగంలో క్లిష్టమైన కేసులను ఛేదించిన పలువురు హెడ్‌కానిస్టేబుళ్లను ఇటీవల బదిలీచేశారు. దోపిడీలు, దొంగతనాలు, అంతర్‌రాష్ట్ర ముఠాలు, జటిలమైన హత్యలకేసుల పరిష్కారంతో పాటు భారీగా రికవరీలు చేసినా, తమకు బదిలీ నజరానా తప్పలేదంటూ సన్నిహితుల వద్ద వాపోయినట్లు తెలిసింది. తాండూరు సబ్‌డివిజన్‌లో పనిచేస్తున్న క్రైమ్ పార్టీ సిబ్బందిలో మూడునెలల క్రితమే శివకుమార్‌ను కొడంగల్‌కు బదిలీ చేయగా, తాజాగా ఆయనను అక్కడ నుంచి కూడా బదిలీచేశారు. మరో ముగ్గురు హెడ్‌కానిస్టేబుళ్ల అంజాద్, రామకృష్ణ, పెద్దేముల్‌లో పనిచేస్తున్న రమేష్‌ను ఇతర పోలీస్‌స్టేషన్‌లకు పంపించేశారు.
ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమే కానీ.. పోలీసుశాఖలో కీలకమైన కేసుల పరిశోధన, కరుడుగట్టిన నిందితులను చాకచాక్యంగా పట్టుకురావడం చాలా సాహసోపేతమైన విధులు. సీనియర్ ఉద్యోగులకు ఆయా ప్రాంతాలపై అవగాహన పెరగడం, పాత నేరస్థులపై నిఘా పెట్టడం, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ఎప్పటికప్పుడు ఆరాతీసి ఉన్నతాధికారులకు చేరవేయడంలో సత్ఫలితాలు సాధించారు. ఇప్పటివరకు తాండూరు సబ్‌డివిజన్‌లో జరిగిన అనేక కఠినమైన కేసుల పరిష్కారం వెనక హెడ్‌కానిస్టేబుళ్ల అంజాద్, శివకుమార్, రామకృష్ణ పాత్ర ఎంతో ఉందని పోలీసు రికార్డులు చెబుతున్నాయి. ఇటీవల ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ నిందితుడిని పోక్సో కేసులో అరెస్టు చేసినా, పోలీసుల కళ్లుగప్పి బేడీలతో సహా పారిపోయాడు. ఈ కేసు చాలా సంచలనం సృష్టించింది. ఓ జవాన్‌పై వేటువేసిన ఉన్నతాధికారులు, ఓ అధికారిపై కూడా వేటు వేసేందుకు సిద్ధపడ్డారు. అయితే, తాండూరులో విధులు నిర్వహిస్తున్న అంజాద్, షబీల్ చాకచక్యంగా వ్యవహరించారు. నిందితుడిని ఆరాతీయగా ఉత్తర్‌ప్రదేశ్‌లో ఉన్నట్లు సమాచారం రాబట్టారు. వెంటనే ఇన్‌స్పెక్టర్ పరమేశ్వర్‌గౌడ్‌కు సమాచారం ఇచ్చారు. ఈ ముగ్గురు టీమ్ యుపికి వెళ్లి నిందితుడిని పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. ఉన్నతాధికారులు ఈ బృందాన్ని అభినందించారు. ఈ టీమ్ గుజరాత్, యుపి, మహారాష్ట్ర, కర్నాటక తదితర రాష్ట్రాలకు వెళ్లి కరుడుగట్టిన నిందితులను పట్టుకురాగలిగారు. పెద్దింటి గొల్ల వంటి అంతర్‌రాష్ట్ర ముఠా సభ్యులను అరెస్టు చేసిన చరిత్ర ఈ పోలీసులకు ఉంది. బైక్ దొంగల కేసుల్లో కూడా ఎంతో కీలకంగా ఉన్నారు.
అత్యంత సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడమే కాకుండా పాత నేరస్థులు పాల్పడే విధానాల గురించి ఎప్పటికప్పుడు అధ్యయనం చేయడం వల్ల కీలకమైన కేసులను పరిష్కరించడంలో వారి పాత్ర ఎంతో ఉన్నది. గడచిన పదేళ్లుగా జిల్లాలో జరిగిన అనేక కీలమైన కేసుల పరిశోధనలో తాండూరు సబ్‌డివిజన్ ముందువరుసలో ఉంది. అందుకు కారణంగా ఇలాంటి మెరికల్లాంటి సిబ్బంది ఉండటమేనని చెప్పవచ్చు. ఈ సిబ్బందిపై ఉన్నతాధికారులు సైతం అనేక రివార్డులు, ప్రశంసలు అందజేశారు.
ఇంతటి ఘనత సాధించిన తాండూరు సబ్‌డివిజన్ క్రైమ్ పార్టీ సిబ్బందిని బదిలీ చేయడం పట్ల స్థానిక ప్రజలు కూడా ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. వీరి పనితీరు వల్ల గత కొంతకాలంగా దొంగతనాలు తగ్గుముఖంపట్టాయి. ఈ నేపథ్యంలో వారి బదిలీను నిలిపివేయాలని ప్రజలే కాకుండా రాజకీయ నేతలు కూడా కోరుతున్నారు. పోలీసు ఉన్నతాధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాల్సిందే. ఇదిలా ఉండగా, ఇద్దరు సిబ్బంది బదిలీ పాస్‌పోర్టు తీసుకున్నట్లు తెలిసింది.

## విద్యార్థులు చదువుతోపాటు అన్నిరంగాల్లోనూ రాణించాలి

**-మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్**
**-స్కూల్‌లో ఫుట్‌బాల్ గ్రౌండ్ ప్రారంభం**



ఫుట్‌బాల్ గ్రౌండ్‌ను ఎంపి ఈటల రాజేందర్ ప్రారంభిస్తున్న దృశ్యం

**శామీర్‌పేట, జూన్ 20, ప్రభాతవార్త:**
చదువుతో పాటు క్రీడలు, యోగా, నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసంలోనూ విద్యార్థులు రాణించాలని మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ సూచించారు. శనివారం శామీర్‌పేట మండలంలోని తూంకుంట లోని పల్లవి ఇంటర్‌నేషనల్ స్కూల్‌లో చైర్మన్ మల్క కొమురయ్యతో కలిసి ఎంపి ఈటల రాజేందర్ ఫుట్‌బాల్‌గ్రౌండ్‌నుప్రారంభించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం, ప్రపంచ సంగీత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపి ఈటల రాజేందర్ మాట్లాడుతూ, విద్యార్థులు కేవలం మార్కులకోసమే చదవకూడదని, విద్యతోపాటు క్రీడలు, యోగా, నైతికవిలువలు, వ్యక్తిత్వవికాసం అన్నీ కలిసినపుడే సంపూర్ణ విద్య సాధ్యమవుతుందన్నారు. ఆరోగ్యమే మహా భాగ్యం, క్రీడలు పిల్లలను చెడు అలవాట్లకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉంచుతాయన్నారు. క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు క్రీడల ద్వారానే వస్తాయని ఎంపి ఈటల రాజేందర్ అన్నారు. ఆయనతో పాటు స్కూల్స్ చైర్మన్ మల్క కొమురయ్య పాల్గొన్నారు. యోగా దినోత్సవాన్ని పురస్కరిం చుకుని విద్యార్థులు యోగాసనాలు ప్రదర్శించగా, మ్యూజిక్ డేలో గానప్రదర్శనతో అలరించారు. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి, ఆరోగ్యంపై అవగాహన, మానసిక ప్రశాంతత, సృజనాత్మకత పెంపొందినట్లు యాజమాన్యం వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పల్లవి గ్రూప్స్ ఆఫ్ స్కూల్స్ డైరక్టర్ డాక్టర్ సంకూరి కార్తీక్, స్కూల్ ప్రిన్సిపల్ డాక్టర్ సుచరితరాయ్, సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణసంఘం అభివృద్ధికి సహకరిస్తాం

**-ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

**షాద్‌నగర్, జూన్ 20, ప్రభాతవార్త:**
రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో నియోజకవర్గ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిని కలిసి బ్రాహ్మణకుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఈసందర్భంగా సంఘప్రతినిధులు మాట్లాడుతూ ఉపనయనాలు, వివాహాలు వంటి శుభకార్యాలు నిర్వహించేందుకు తమకు సొంత భవనం లేకపోవడంతో అద్దె భవనాలపై ఆధారపడాల్సి వస్తోందని తెలిపారు. బ్రాహ్మణ సంఘం కోసం వెయ్యి గజాల స్థలం కేటాయించి, భవన నిర్మాణానికి నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి ఆర్థిక సహాయం అందించాలని కోరారు. వారి విజ్ఞప్తిపై స్పందించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ బ్రాహ్మణ సంఘం అభివృద్ధికి తన వంతు సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తానని, సంఘం సమస్యలను పరిశీలించి త్వరలోనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. మాజీఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డికూడా సంఘ అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు సుజీవన్, సంఘ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పూర్ణచంద్ర, వేణుగోపాలకృష్ణ, రామసత్యనారాయణ, రవిశర్మ, హర్మల్ సుదర్శన్‌రావు, హర్మన్ రవిప్రకాష్, నరేందర్ రాదేశ్యామ్, కమల్‌కిషోర్‌శర్మ, గజేంద్ర తిరుమలచార్యులు, నాగరాజుశర్మ, వంశీశర్మ, రాజగోపాల్, వేణుగోపాలరావు, కొత్తూరు, షాద్‌నగర్ బ్రాహ్మణులు, మార్వాడీ బ్రాహ్మణులు తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

**-జిల్లా కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ దీపక్ తివారి, ఎస్పీ సేహ మెహ్రా**



పరీక్షాకేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ

**వికారాబాద్, జూన్ 20, ప్రభాతవార్త:**
వికారాబాద్ జిల్లాలో నిర్వహించనున్న నీట్‌పరీక్షను అత్యంత పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు జిలా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. ఇందులో భాగంగా శనివారం జిల్లాలోని పరీక్షాకేంద్రాలను జిల్లాకలెక్టర్ దీపక్ తివారి, జిల్లాఎస్పీ స్నేహ మెహ్రా సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పరీక్షాకేంద్రాలను సందర్శించిన అధికారులు, అభ్యర్థులకు కల్పిస్తున్న వసతులు, భద్రతాచర్యల గురించి ఆరాతీశారు. పరీక్షాకేంద్రాల్లో తాగునీరు, విద్యుత్‌సౌకర్యం, మరుగు దొడ్లు, సిసి కెమెరాల ఏర్పాటు, సీటింగ్ అమరిక వంటిఅంశాలను అధికారులు క్షుణ్ణంగా తనిఖీచేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పరీక్షలు ప్రశాంతంగా, ఎటువంటి ఆటంకాలు లేకుండా నిర్వ హించేందుకు సంబంధితశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పరీక్ష నిర్వహణలో ఎటువంటి అవాంతరాలు తలెత్తకుండా అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన ఐదు పరీక్షాకేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, అభ్యర్థులను పూర్తిస్థాయిలో తనిఖీచేయాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు నిర్ణీత సమయానికి ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని, నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచించారు. పరీక్షాకేంద్రాల్లోకి ఎట్టి పరిస్థితుల్లోనూ నిషేధిత వస్తువులను అనుమతించ బోమని వారు స్పష్టంచేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, ట్రైనీకలెక్టర్ సచిన్‌బస్వరాజ్ గుట్టూర్, డిఎస్పీ అంజయ్య, సిటీ కో-ఆర్డినేటర్ సాయిలత, తహసీల్దార్ లక్ష్మీ నారాయణ, నెమతి హాలీ, అధికారులు, విద్యాశాఖ ప్రతినిధులు, పరీక్షాకేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

## కెటిఆర్‌తో అల్పాహారవిందులో ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

**-కెటిఆర్‌తో పాటు మాజీమంత్రి, ఎమ్మెల్యే, ఎమ్మెల్యేలు**



కెటిఆర్‌తో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

**షాద్‌నగర్, జూన్ 20, ప్రభాతవార్త:**
ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ నిర్వహిస్తున్న పలు కార్యక్రమాలకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ హైదరాబాద్ నుండి బయలుదేరారు. ఈసందర్భంగా మార్గమధ్యలో కెటిఆర్‌తో అల్పాహారవిందులో ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీమంత్రి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కొడంగల్‌లో అభివృద్ధి శూన్యం

**-ఎంఐఎం తాలూకా అధ్యక్షులు గుల్షన్**



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఐఎం పార్టీ నాయకులు

**కొడంగల్, జూన్ 20, ప్రభాతవార్త:**
సిఎం రేవంత్‌రెడ్డి సొంతనియోజకవర్గం కొడంగల్‌లో అభివృద్ధి శూన్యమని ఎంఐఎం పార్టీ తాలూకా అధ్యక్షులు ఎస్బి.గుల్షన్ ఆరోపించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అభివృద్ధికి కోట్లాది రూపాయలు మంజూరుచేశామంటున్నా కొడంగల్‌లో అభివృద్ధి ఎందుకు జరగడం లేదన్నారు. 9నెలలక్రితం అభివృద్ధి పేరుతో అంబేద్కర్ చౌరస్తాలో బస్టాండ్ ఎదుట చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపించకుండా డబ్బాలు తొలగించడంతో రోడ్డునపడ్డారని ఆరోపించారు. అదేవిధంగా రోడ్డు విస్తరణలో అర్ధరాత్రి సమయంలో మతస్థలాలు, దర్గా, ఆశుర్‌ఖానా, శ్మశానవాటికల ప్రహరీలు తొలగించారన్నారు. ఈ విషయంపై సిఎం రేవంత్‌రెడ్డిని కలిసి వివరించగా, పునర్‌నిర్మాణానికి హామీ ఇచ్చినా, ఫలితం లేకపోయిందన్నారు. అభివృద్ధిపేరిట కూల్చివేతలు తప్ప అభివృద్ధి ఎక్కడా జరగడంలేదన్నారు. మైనార్టీలను కేవలం ఎన్నికల సమయంలో ఓటుబ్యాంకుగా వాడుకుంటున్నారని, అభివృద్ధి చేసిందేమీ లేదన్నారు. వారంరోజుల్లో యథాస్థానంలో మతస్థలాల పునర్‌నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసనలు చేస్తామన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు ఎండి.సర్తాజ్ హుస్సేన్, సయ్యద్ అర్షద్ అలీ ఖాద్రీ పాల్గొన్నారు.

## శ్రీవారి ఆలయ నిర్మాణ పనుల పరిశీలన



శ్రీవారి ఆలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారులు

**కొడంగల్, జూన్ 20, ప్రభాతవార్త:**
శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులను వివిధ శాఖల అధికారులు శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా వారు ఆలయ ప్రధాన మంటపం దగ్గర 12 ఫీట్ల వరకు లోతుగా తవ్వడంతో నల్లమట్టి రావడంతో మరింత లోతుగా తవ్వాలని సూచించారు. అధికలోతు తీయడంతో నీరు వస్తుందని తెలిపారు. నీటిని మోటర్ల సహాయంతో తొలగించి గట్టిగా మట్టి వచ్చేంతవరకు తీయాలని సూచించారు. ప్రస్తుతం సేకరించిన స్థలంలో మరికొంత భాగం ఈశాన్య ప్రదేశంలో స్థల సేకరణ చేయాలని అన్నారు. వచ్చే నెల 2న శ్రీవారి మూలవిరాట్ వద్ద పూజలుచేయాలని కన్సల్టెంట్ ఈఈ సూర్యనారాయణ తెలిపారు. ఆలయ మంటపాలకు సంబంధించి శిలలు చెక్కేందుకు స్థలం త్వరగా చదును చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్, ఆర్అండ్‌బి డిఈ సురేందర్, తహశీల్దార్ రాంబాబు, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్, ఆర్అండ్‌బి ఏఈ శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతుసంక్షేమానికి అవిరళ కృషి: ఎమ్మెల్యే

**చేవెళ్ల, జూన్ 20, ప్రభాతవార్త:**
రైతుల సంక్షేమమే కాంగ్రెస్‌ప్రభుత్వ లక్ష్యమని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. శనివారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపుకార్యాలయంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు ఉచితంగా కంది విత్తనాలను అందించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏవో శంకర్‌లాల్, మున్సిపల్ చైర్‌పర్సన్ సమతా వెంకట్‌రెడ్డి, వైస్ చైర్మన్ రాములుగౌడ్, మార్కెట్ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్‌చైర్మన్ రాములు, పిఎసిఎస్‌చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, గోనే ప్రతాప్‌రెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు, రైతులు తదితరులు ఉన్నారు.

# ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ



సమావేశంలో మారుతున్న ఆర్డీవో శ్రీనివాసరెడ్డి

**యాచారం, జూన్ 20, ప్రభాతవార్త:** ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో అధికారులు అవగాహన కలిగి ఉండాలని ఇబ్రహీంపట్నం ఆర్డిఓ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. యాచారం మండల పరిషత్ కార్యాలయంలోని మహిళా సమైక్య భవనంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఆర్డిఓ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో రాధా రాణి, డిప్యూటీ తాసిల్దార్ కీర్తి సాగర్, ఎన్నికల బూత్ సవరణ అధికారి మోతీలాల్, వివిధ గ్రామాల కార్యదర్శులు, రెవెన్యూ అధికారులు, అంగన్వాడి సిబ్బందితో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారుల ఉద్దేశించి ఆర్డీవో శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. చట్ట ప్రకారం భారత ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా సవరణలు తయారీకి పూర్తి అధికారం కలిగి ఉంటుందన్నారు. ఓటర్ల జాబితా యొక్క సమగ్ర తను కాపాడడానికి కమిషన్ ప్రతి ఎన్నికలకు ముందు లేరా అవసరాన్ని బట్టి ఓటర్ల జాబితా సవరణలు ఆదేశిస్తుందన్నారు. ప్రస్తుతం ప్రజలు తరచుగా వలసలు వెళ్లడం వల్ల వస్తున్న మారుతున్న మార్పులకు అనుగుణంగా ఓటర్ల జాబితాలో ఎప్పటికి అప్పుడు మార్పులు చేర్పులు చేయాల్సి ఉంటుందని అన్నారు. దీనివల్ల ఓటర్లు ఒకటి కంటే ఎక్కువ ప్రదేశాలలో నమోదవడం మరణించిన ఓటర్ల పేర్లను తొలగించకపోవడం వంటి సమస్యలు వచ్చాయని అందువల్ల ఏ అర్హుడైన పౌరుడు కూడా ఓటర్ల జాబితా నుండి తప్పిపోకూడదని ఏ అనరుడు కూడా ఇందులో చేర్చబడకూడదు అనే ముఖ్య లక్ష్యంతో ఎన్నికల సంఘం ఈ ప్రత్యేక సమగ్ర సవరణ ప్రకటించిందన్నారు. ఇంటి గణన 25 నుంచి 24 వరకు, ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచరణ 31 జులై వరకు, నోటీసు దశ జారీ ప్రచరణ ధ్రువీకరణ ఎనిమినేషన్ ఫారంలపై నిర్ణయం క్లైమ్ అభ్యంతరాల పరిష్కారం విఆర్వోలు ఎన్రోల్ రిజిస్టర్ స్టేషన్ అధికారులు ఏ కాలంలో నిర్వహిస్తారన్నారు. తుది జాబితా ప్రసరణ అక్టోబర్ 1 వరకు పూర్తవుతుందన్నారు. ప్రజలు అధికారులు ప్రజాప్రతినిధుల సమన్వయం సహకారాలతోని సమగ్ర ఓటర్ జాబితా సవరణ జరుగుతుందని అందుకు అందరు సహకరించాలని కోరారు.



మాట్లాడుతున్న ఆర్డీవో

## ఓటరు నమోదును పారదర్శకంగా నిర్వహించాలి : ఆర్డీవో

**మొగుడంపల్లి, జూన్ 20 (ప్రభాతవార్త):** మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు), బూత్ స్థాయి ఏజెంట్లు(బీఎల్ఏలు)కు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆర్డీవో దేవుజా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీవో దేవుజా మాట్లాడుతూ, ఈ నెల 25వ తేదీ నుంచి జూలై 24వ తేదీ వరకు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరిస్తారని, ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఓటరు నమోదు, మార్పులు, తొలగింపులను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఖచ్చితమైన, తప్పులు లేని ఓటరు జాబితా తయారీలో బీఎల్ఓలు, బీఎల్ఏలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అనంతరం ఎస్ఐఆర్ కార్యక్రమం నిర్వహణకు అవసరమైన కిట్ బ్యాగ్లను బీఎల్ఓలు, బీఎల్ఏలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జుబేర్, మాస్టర్ ట్రైనర్లు శ్రీనివాస్, ఎంపీడీఓ అంజనీదేవి, అధికారులు, బీఎల్ఓలు, బీఎల్ఏలు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, సర్పంచ్ అధ్యక్షుడు ఒగ్గు శ్రీనివాస్



వెంకటాచల ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న గ్రామ సర్పంచ్ ఒగ్గు శ్రీనివాస్ తదితరులు

**సదాశివపేట జూన్ 20 ప్రభాతవార్త :** పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములై మొక్కలు నాటాలని వెంకటాపూర్ గ్రామ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఒగ్గు శ్రీనివాస్ అన్నారు. శనివారం వన మహోత్సవంలో భాగంగా వెంకటాచల దివ్య క్షేత్రం ఆలయంలో సర్పంచ్ వార్డుసభ్యులు మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటుదాం భవిష్యత్తును కాపాడుదాం అని నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని అప్పుడే మొక్కలు చెట్లయి ఆక్సిజన్‌వంటి గాలినిస్తాయన్నారు. చెట్లు ఉంటే వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, పాడిపంటలతో రైతులు ప్రజలు సుభిక్షంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఇమ్రాన్, ఉప సర్పంచ్ మహేందర్. వార్డు సభ్యులు. యోహాన్. జనార్దన్. నవీన్. నర్సింలు, నాయకులు డి.క్రిష్ణ. ఖలీల్, పి.శ్రీనివాస్‌రెడ్డి, కె.హరికాంత్, మల్లేశం, రాజేష్, అప్పి తదితరులు పాల్గొన్నారు

## అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి :పెద్దగొల్ల శ్రీహరి



ఎంఇవోకు వినతి పత్రం అందజేస్తున్న బిఆర్ఎస్వి నాయకులు

**సదాశివపేట, జూన్ 20 ప్రభాతవార్త:** పట్టణంలో అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని టిఆర్ఎస్వి నియోజకవర్గ కన్వీనర్ పెద్దగొల్ల శ్రీహరి అన్నారు. శనివారం బిఆర్ఎస్వి సంగారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ పెద్దగొల్ల శ్రీహరి, పట్టణ అధ్యక్షుడు రోషన్ ఆధ్వర్యంలో మండల విద్యాధికారి ఎన్.శంకర్కు వినతిపత్రం అందజేశారు. సదాశివపేట మండలంలోని ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధికఫీజులు వసూలు చేయడన్ని అరికట్టాలని, అదే ధంగా నోటు బుక్స్, పాఠ్యపుస్తకాలు, ట్యూషన్ ఫీజుల రూపంలో వేధించడాన్ని నిరోధించాలని ఆ వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వి అద్యక్ష, కార్యదర్శి, ఉపాద్యక్షులు, పాండునాయక్, అక్షయ్, నవీన్, యువత అధ్యక్షులు నరేష్‌గౌడ్, నాయకులు ఉప సర్పంచులు కాదర్, అహ్మద్ మరియు నాయకులు శంకర్, అభిలాష్‌లు పాల్గొన్నారు.

## ఎంపిడివోగా అంజనీదేవి బాధ్యతల స్వీకరణ



ఎంపీడీవో అంజనీదేవిని సన్మానిస్తున్న ఉద్యోగులు

**మొగుడంపల్లి, జూన్ 20,ప్రభాతవార్త:** మండల ఎంపీడీఓగా పి.అంజనీ దేవి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఆమె రాయికోడ్ మండలంలో విధులు నిర్వర్తించారు. ఇక్కడ పనిచేసిన ఎంపీడీఓ మహేష్ గజ్వేల్‌కు బదిలీ కావడంతో ఆమె నియమితులయ్యారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అధికారులు, సిబ్బంది అంజనీదేవిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ యాదగిరి, సూపరింటెం డెంట్ శ్రీనివాస్, ఏపీవో గణేష్, టిఎ యాదగిరి, బాలరాజు, సతీష్ పాల్గొన్నారు.

## ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో యోగా దినోత్సవం

**మొదంపల్లి, జూన్ 20 ప్రభాతవార్త :** మండలంలో ఆయా పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్స వం వేడుకలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థిని విద్యార్థులకు యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల హెచ్ఎంలు మాట్లాడుతూ యోగా అనేది నిత్యజీవితంలో ఎంతో ఉపయోగకరమైన ఆరోగ్యంగా ఉండడానికి యోగాసనాలు ఎంతో ఉపయోగంగా ఉంటాయని ప్రతి విద్యార్థిని విద్యార్థులు ఉదయం వేళలో యోగాసనాలు వేసి తమ ఆరోగ్యాన్ని తానే కాపాడుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హిమ బిందు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**గుమ్మడిదల, జూన్ 20 (ప్రభాతవార్త):** మున్సిపల్ పరిధిలోని 11వ వార్డుకు చెందిన బుల్లబోయిన శ్రీకాంత్ ఇటీవల మృతి చెందగా, ఆయన కుటుంబానికి అండగా నిలుస్తూ సీకేజీ యువసేన సభ్యులు ఆర్థిక సాయం అందజేశారు. మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్‌గౌడ్ సూచనల మేరకు శనివారం సీకేజీ యువసేన సభ్యులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చి, ధైర్యంగా ఉండాలని సూచించారు. భవిష్యత్తులో కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీకేజీ యువసేన సభ్యులు, స్థానిక నాయకులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఫీజులదోపిడీ చేస్తున్న స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

-బిఆర్ఎస్వి విభాగం రాష్ట్ర కార్యదర్శి జంగయ్య



మండల విద్యాధికారికి వినతిపత్రం సమర్పిసున్న దృశ్యం

**మోమిన్‌పేట్, జూన్ 20, ప్రభాతవార్త:** ప్రైవేట్ పాఠశాలల ఫీజులు దోపిడి చేస్తున్న స్కూల్ యజమాన్యంపై తెలంగాణ ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకొని, ప్రభుత్వ పాఠశాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని బీఆర్ఎస్వీ విభాగం రాష్ట్ర కార్యదర్శి జంగయ్య డిమాండ్ చేస్తు మండల విద్యాధికారి నర్సింలుకు మండలవనరుల కేంద్రంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు వికారాబాద్ జిల్లా కేంద్రంలోనే ప్రైవేటు పాఠశాలలు అన్నాయనుకుంటే, చివరకు మండల కేంద్రాలలో కూడా ప్రైవేట్ స్కూళ్ల వ్యాపారంగా విచ్చలవిడిగా మారాయని ద్వజమెత్తారు. మండల విద్యాధికారిగా తమ బాధ్యతలను దృష్టిలో పెట్టుకొని తక్షణ చర్యలు తీపుకోవాలని కోరారు. లేని పక్షంలో బీఆర్ఎస్వి విభాగం ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా, ఆపై జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు, ధర్నాలు చేపడుతామని హెచ్చరించారు. నేటి బాలలే రేపటి భావిభారత పౌరులు, కనుకా విద్యార్థుల భవిష్యత్తుతో ఎవరూ చెలగాటమాడేందుకు వీల్లేదన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తిరుపతిరెడ్డి, శోభన్, మహబూబ్ అలీ, కృష్ణ, జుబేర్, సందీప్, రాజు పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

## జిపి 10 శాతం భూముల పరిరక్షణే లక్ష్యం

-నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ స్పష్టం

**నందిగామ, జూన్ 20, ప్రభాతవార్త:** నందిగామ మండల కేంద్రంలో వెంచర్లలో ఉన్న గ్రామపంచాయతీ 10 శాతం భూములను శనివారం నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ , పాలకవర్గంతో కలిసి పరిశీలించారు. జెసిబి సాయంతో 10 శాతం భూముల్లో ఉన్న పిచ్చి మొక్కలు తొలగించారు. గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న వెంచర్లలో పంచాయతీకి రావలసిన 10 శాతం భూములు సైతం కబ్జాకు గురైనట్లు ఆయన వెల్లడించారు. వర్షాకాలం సమీపిస్తునందున 10 శాతం భూముల్లో చదును చేసి మొక్కలు నాటేందుకు సిద్ధం చేస్తున్నట్లు సర్పంచ్ కొమ్ము కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంకటేష్ గౌడ్, వార్డు సభ్యులు అగ్గిప్రసాద్, ట్రైలర్ కృష్ణ, బొమ్మగళ్ళ నరసింహులు, చించేటి లతా శివకుమార్ గౌడ్, సరిత మురళి, నాయకులు నరేందర్ రెడ్డి, ఎర్రగారి రమేష్, గ్రామపంచాయతీ పారిశుద్ధ సిబ్బంది పాల్గొన్నారు.

## సహకార సంఘంలో ఎరువులు అందుబాటు

**తలకొండపల్లి జూన్ 20, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జల్, పడకల్ గ్రామాలలోని సహకార సంఘాలలో రైతులకు కావలసిన ఎరువులు అందుబాటులో ఉన్నాయని సింగల్ విండో చైర్మన్ గట్లకేశవరెడ్డి తెలిపారు. శనివారం నాడు మండల పరిధిలోని పడకల్ గ్రామంలో గల సింగల్ విండో గోదాం వద్ద ఆయన రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కేశవరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సీజన్లో రైతులకు కావలసిన ఎరువులు సహకార సంఘం వెల్జల్ పడకల్లు అందుబాటులో సహకార సంఘం వెల్జల్ పడకల్లు లో యూరియా, 20 20 20 ఎరువులు అందుబాటులో ఉన్నాయని ,కావలసిన రైతులు ఎరువుల యాప్ లో బుక్ చేసుకున్న రైతులకు ఇవ్వనున్నట్లు ఆయన ఎరువుల యాప్ లో బుక్ చేసుకున్న రైతులకు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగ పర్చుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సింగల్ బిండ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, కాంగ్రెస్ మహిళా తాలూకా అధ్యక్షురాలు నట్టుపల్లి రమాదేవిలోకం టిఆర్ఎస్ మండల అధ్యక్షులు మాజీ సర్పంచ్ కుమార్ శంకర్ నాయకులు శంకర్ నాయక్ యాదయ్య జగ్గారెడ్డి చిన్నయ్య దాసు అమృత లింగం శేఖర్ రాములు వెంకటరెడ్డి నాయకులు శంకర్‌నాయక్ యాదయ్య జగ్గారెడ్డి చిన్నయ్య దాసు అమృత లింగం శేఖర్ రాములు వెంకటరెడ్డి తదితరులున్నారు.

## కెసిఆర్ ప్రభుత్వంలోనే రైతులకు నిజమైన మేలు

-షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్యయాదవ్

**షాద్‌నగర్, జూన్ 20, ప్రభాతవార్త:** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో వ్యవసాయ రంగానికి జరిగిన మేలును తెలంగాణ రైతాంగం ఎన్నటికీ మర్చిపోదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రైతులకు అదే స్థాయిలో మేలు చేసే విధంగా పాలన అందించాలని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ అన్నారు. రైతుబంధు, రైతు బీమా, ఉచిత విద్యుత్, సాగునీటి ప్రాజెక్టుల ద్వారా రైతులకు అండగా నిలిచిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని రైతులు ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. షాద్‌నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, వ్యవసాయ రంగానికి నాణ్యమైన, అంతరాయం లేని 24 గంటల ఉచిత విద్యుత్‌ను అందించడం వల్ల రైతులు రాత్రి వేళల్లో పొలాలకు వెళ్లే ఇబ్బందులు తప్పాయని గుర్తు చేశారు. ప్రస్తుతం నాణ్యమైన విద్యుత్ సరఫరా లేకపోవడంతో పాటు విద్యుత్ కోతలు పెరిగాయని ఆరోపించారు. రైతుబంధు పథకం ద్వారా ప్రతి ఎకరానికి ఏడాదికి రూ.10 వేల పెట్టుబడి సాయాన్ని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం వల్ల విత్తనాలు, ఎరువుల కోసం రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన అవసరం లేకుండా పోయిందన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు పెట్టుబడి సాయం ఏకకాలంలో అందడం లేదని విమర్శించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయడంపై దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి, ఈట గణేష్, ఎంఎస్ నటరాజన్, లక్ష్మణ్ నాయక్, దేవేందర్ యాదవ్, పెనుమని గోపాల్, చీపిరి రవి యాదవ్, జట్టా కుమార్, యుగంధర్, అశోక్, విశ్వ, రామకృష్ణ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభం

**శామీర్‌పేట, జూన్ 20, ప్రభాతవార్త:** లక్ష్మాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్ ప్రారంభించి లబ్ధిదారుల చేత గృహప్రవేశం చేయించారు. శనివారం మూడుచింతలపల్లి మున్సిపల్ పరిధిలోని లక్ష్మాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను జిల్లా ఆర్టీఎ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు దోసకాయల వెంకటేశ, స్థానిక కౌన్సిలర్లు కె.శ్రీవాణివైద్యనాథ్, సరితశ్రీనివాస్‌గౌడ్‌లతో కలిసి మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్ ప్రారంభించారు. లక్ష్మాపూర్ గ్రామంలో నివాసం ఉంటున్న లబ్దిదారులు దండు లలిత-యాదగిరి (దంపతులు)లకు రాష్ట్రప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేసింది. ప్రభుత్వం నుంచి 5లక్షల రూపాయలు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంకు ఆర్థిక సహాయం అందటంతో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్నందుకు పలువురు లబ్దిదారులను అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు కాంగ్రెస్ నాయకులు బండి జగన్నాథం, గుర్రం బస్వారెడ్డి, కటికల గోపి, బండి రవి, మురళిగౌడ్, కత్తి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## నందిగామలో వివోఏలకు శిక్షణ

**నందిగామ, జూన్ 20, ప్రభాతవార్త:** నందిగామ మండల సమాఖ్య కార్యాలయంలో ఎంసీఎల్ఎఫ్ పైన స్టేట్ రిసోర్స్ పర్సన్ లు ప్రమీల, ఉశలు వివోఏ లకు ఒకరోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా విజన్ బిల్డింగ్, రాబోవు ఐదు సంవత్సరాల వరకు అన్యువల్ యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవడం, కమ్యూనిటీ కలలు సాకారం చేసుకోవడం గురించి అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో డిఆర్డిఏ మండల ఏటీఎం భగవంతు, సిసిలు అరుణ, అనురాధ, అమృత, గ్రామ సంఘం అధ్యక్షులు, వివోఏలు పాల్గొన్నారు.

## చెప్పిన హామీలను నెరవేర్చాలి

-పరిగి మాజీ శాసనసభ్యులు కొప్పుల మహేష్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి

**పరిగి టౌన్, జూన్ 20, ప్రభాతవార్త:** తెలంగాణ రాక మునుపు రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా ఉండేది, కెసిఆర్ అధికారంలో వచ్చిన వెంబడే కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తిగా మరియు పాలమూరు రంగారెడ్డి 90 పూర్తి చేసి వేగంగా పూర్తిచేసిన లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుగా నిలిపారని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు.. మిషన్ కాకతీయ పేరుతో రాష్ట్రంలో 45 వేల చెరువులను బాగు చేయించారని దాంతో తెలంగాణలో వరి అధికంగా పండించడం ప్రారంభించారని తెలంగాణ రాకముందు 60 లక్షల మెట్రిక్ టన్నులు పండే వరి తెలంగాణ వచ్చిన తర్వాత రెండున్నర కోట్ల మెట్రిక్ టన్నులు పండుతుంది దానికి కారణం కొత్త ప్రాజెక్టులు నిర్మించడం పాత ప్రాజెక్టులను పూర్తి చేయడం బీమా నెట్టెంపాడు వంటి ప్రాజెక్టులుగత ప్రభుత్వంలో రైతులకు 24 గంటలు ఉచిత కరెంటు ఇచ్చేవారు పండించిన పంటను చివరి గింజ వరకు కొనడం జరిగింది. ఇప్పటివరకు ఏ కొనుగోలు కేంద్రంలో కూడా సంపూర్ణంగా వడ్లు కొనుగోలు చేయలేదు. ఇప్పటివరకు సంవత్సరానికి మూడుసార్లు ఇస్తామన్నా రైతు బంధు లేదు రైతు భరోసా లేదు రైతు బీమా లేదు 24 గంటల కరెంటు లేదు యూరియా సప్లై సరిగ్గా లేదు రుణమాఫీ పూర్తిగా చేయలేదని ఈ ప్రభుత్వం పూర్తిగా రైతు వ్యతిరేకిగా పనిచేస్తుందని కాబట్టి వెంటనే ప్రభుత్వం పునర్ ఆలోచన చేసి వడ్లను పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని యూరియాను సరిపోయిన విధంగా వెంటనే సప్లై చేయాలని రైతులను తగిన విధంగా ప్రభుత్వం పట్టించుకోకపోతే వెంటనే బి ఆర్ ఎస్ పార్టీ తరపున పోరాటం చేస్తామని తెలియజేశారు. సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు ప్రజాప్రతినిధులు వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ఘట్‌కేసర్, జూన్ 20, ప్రభాతవార్త:** విద్యుత్ తీగల కింద చెట్లకొమ్మలు తొలగిస్తున్న కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గుతుందని ఘట్‌కేసర్ సెక్షన్ ఇంచార్జ్ ఏఈ ఎం.ప్రసన్నాంజనేయులు తెలిపారు. 11 కెవి డానో ఫీడర్ పరిధిలోని ఫకీర్‌టెక్యా, లింగాపూర్, కెఎల్ఆర్‌నగర్, జెడి రబ్బర్ పౌడర్ కంపెనీ, కెఎస్ఆర్, రాక్‌వుడ్ స్కూల్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, 11 కెవి ఎన్‌టిపిసి కాలనీ ఫీడర్ పరిధిలోని ఎన్‌టిపిసిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్‌సరఫరా నిలిపివేస్తున్నామని వినియోగదారులు, కంపెనీల నిర్వహకులు గమనించి ముందస్తు జాగ్రత్తలు తీసుకొని తమకు సహకరించాలని ఏఈ సూచించారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

**కొడంగల్, జూన్ 20, ప్రభాతవార్త:** యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ టి.రాంబాబు అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్‌విభాగం అంతర్జాతీయ యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల పూర్వ విద్యార్థినీ అపర్ణ,యోగా మాస్టర్ శారీరక,మానసిక,ఆధ్యాత్మిక సమతుల్యతను పెంపొందించే ఒక అద్భుతమైన జీవన విధానం యోగా అని తెలుపుతూ వివిధ రకాల యోగాసనాలు,వాటి ఆరోగ్య ప్రాముఖ్యత ప్రదర్శనతో వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ డా.ఆర్ శ్రీనివాస్, సోమేల, రమేష్‌బాబు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యతోనే ఉజ్వల భవిషత్తు

-ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ

**కేశంపేట, జూన్ 20, ప్రభాతవార్త:** కేశంపేట మండలం పరిధిలోని ఆల్వాల, తులావనిగడ్డ గ్రామాలలో సర్పంచ్ లంకాల సురేష్‌రెడ్డి తన కుమారుడు లంకాల శ్రేయన్‌రెడ్డి జ్ఞాపకార్థం శనివారం విద్యార్థులకు స్కూల్‌బ్యాగులు, పెన్నులు, పెన్సిళ్లు, పుస్తకాలు న్యూ డాన్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్లేట్లు, గ్లాసులు అందజేశారు. అనంతరం సర్పంచ్ సురేష్‌రెడ్డి మాట్లాడుతూ విద్యతోనే భవిషత్తు బంగారం ఉంటుందని ప్రతివిద్యార్థి కష్టపడిచదివి ఉన్నతశిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ తిరుమలరెడ్డి మల్లేష్, వార్డుమెంబర్లు, గ్రామసెక్రటరీ నదీమ్, ఫౌండేషన్ ప్రతినిధులు ఆంజనేయ ప్రసాద్, శ్రీనివాస్, బాలకుమార్, సాయిసుధాకర్, చంద్రశేఖర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, శ్రీధర్, టీచర్ మిస్సి మాధురి, తులావని గడ్డ టీచర్ మాధురి, గ్రామస్థులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి

-మంత్రులకు వినతిపత్రాలు అందజేసిన సర్పంచ్ స్వాతిమాణిక్యంగౌడ్



రాష్ట్ర మంత్రులకు వినతిపత్రాలు సమర్పించిన సర్పంచ్

**షాబాద్, జూన్ 20, ప్రభాతవార్త:** షాబాద్ మండల పరిధిలోని తాళ్లపల్లి గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం గ్రామ సర్పంచ్ కందికంటి స్వాతి మాణిక్యం గౌడ్ చొరవ తీసుకున్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, పశుసంవర్ధక, గొర్రెలు మేకల అభివృద్ధి శాఖ మంత్రి వాకిటి శ్రీహరిలకు వారి వారి కార్యాలయాల్లో శనివారం కలిసి ప్రత్యేక వినతిపత్రాలను సమర్పించి గ్రామ సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. వినతిపత్రంలో తాళ్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో సుమారు 5,000 మంది ప్రజలు నివసిస్తున్నారని, గ్రామ ప్రజలకు ఉపయోగపడే విధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం నిర్మాణం పూర్తయినప్పటికీ వైద్య సిబ్బంది లేకపోవడంతో సేవలు అందడం లేదని పేర్కొన్నారు. గ్రామంలో గర్భిణీలు, వృద్ధులు, చిన్నారులు వైద్య సేవల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నందున వెంటనే వైద్య సిబ్బందిని నియమించి ఆరోగ్య కేంద్రాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రిని కోరారు. అదేవిధంగా గ్రామంలో గత 15 సంవత్సరాలుగా పశువైద్య దవాఖాన లేకపోవడంతో రైతులు, పశుపాలకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మరో వినతిపత్రంలో వివరించారు. పశువులకు వ్యాధులు సోకినప్పుడు చికిత్స కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, తాళ్లపల్లిలో శాశ్వత పశువైద్య దవాఖానను ఏర్పాటు చేసి పశుసంవర్ధక రంగానికి ఊతమివ్వాలని కోరారు. గ్రామాభివృద్ధి, ప్రజల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని, గ్రామ ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని, గ్రామ సమస్యలపై మంత్రులు సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు లక్ష్మి, మల్లేష్, ప్రకాష్, నవనీత, బాలరాజ్, జయమ్మ, బండ శ్రీనివాస్ గౌడ్, నాగేష్ గౌడ్, ముబీన్ తదితరులు పాల్గొన్నారు.

## చెట్లను నాటి సంరక్షించాలి: సర్పంచ్



మొక్కలు నాటుతున్న సర్పంచ్ యాదవరెడ్డి తదితరులు

**పూడూరు, జూన్ 20, ప్రభాతవార్త:** మానవుని మనుగడకు ఆధారంచెట్లు వాటిని నాటి సంరక్షించాలని సర్పంచ్ సిద్ధన్నగారి యాదవరెడ్డి పేర్కొన్నారు. శనివారం పూడూరు మండలం పరిధిలోని అంగడి చిట్టంపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాల ఆవరణలో పాఠశాల విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతోపాటు వాతావరణ సమతుల్యతకు చెట్లు ఎంతో దోహదపడుతాయని వివరించారు. ప్రతిఒక్కరు చెట్లనునాటి కాపాడాలని సూచించారు. గ్రామంలో నూతనంగా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏరాటుచేయడంవల్ల విద్యుత్తుసమస్య తీరిందని తెలియజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మమత, ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నరేందరెడ్డి, ఖాజపాష, పంచాయతీ వార్డుసభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరభ్యాసం

**శామీర్‌పేట, జూన్ 20, ప్రభాతవార్త:** సింగాయిపల్లిలో అంగన్‌వాడి కేంద్రంలో చిన్నారులకు మేడ్చల్ జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి అక్షరభ్యాసంను చేయించారు. శనివారం శామీర్‌పేట మండలంలోని సింగాయిపల్లి అంగన్‌వాడి కేంద్రంలో పిల్లలకు అక్షరభ్యాసం కార్యక్రమం అంగన్‌వాడి టీచర్ జమున ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి పాల్గొని పిల్లలచేత అక్షరభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు రాజబోయిన శ్రీనివాస్‌యాదవ్, ఎండి జాఫర్, నియోజకవర్గ యూత్‌కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కత్తి రమేష్, అంగన్‌వాడి టీచర్ జమున పిల్లలు పాల్గొన్నారు.

## సంస్కృతి స్కూల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవం

**చేవెళ్ల, జూన్ 20, ప్రభాతవార్త:** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని సంస్కృతి స్కూల్‌లో శనివారం ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. జూన్ 21 ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే విద్యార్థులతో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తెల్లని దుస్తులు ధరించి ఉత్సాహంగా యోగాసాధనలో పాల్గొన్నారు. ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో వివిధ యోగాసనాలు, శ్వాస సంబంధిత వ్యాయామాలు చేశారు. శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఆరోగ్యకరమైన జీవనశైలికి యోగా ఎంతో ఉపయోగపడుతుందని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమం విజయవంతంగా సాగిందని, విద్యార్థులు తమ నిత్యజీవితంలో యోగాను అలవాటు చేసుకునేలా ప్రేరణ పొందారని పాఠశాల కరస్పాండెంట్ ఎ.శశిపాల్‌రెడ్డి తెలిపారు.

## పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం

**గజ్వేల్ టౌన్, జూన్ 20 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు హరిజనవాడలో గల ప్రాథమిక పాఠశాలలో శనివారం సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌చైర్మన్ గంగిశెట్టి చందనరవీం దర్, ఏసిపి నర్సింలు హాజరయ్యారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్, కౌన్సిలర్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


IN THE COURT OF THE HON'BLE III ADDL. DISTRICT JUDGE, RANGA REDDY DISTRICT AT LB NAGAR
O.S NO. 1 OF 2018

BETWEEN:
Mahender Kumar@ Mahendar Jaiswal ...Plaintiff
AND
Santhosh Kumar Jaiswal and others ...Defendants

NOTICE

To
23. Begari Yadaiah, S/o. Late B. Madaiah, aged about 45 years, Occ: Govt employee, R/o. Batasingaram Village, Abdullapurmet Mandal, RR District – 501512.
42. Chillara Venkaataiah, S/o. Late C. Narasimha, aged about 65 years, Occ: Retd. Employee, R/o. Pigilpur Village, Abdullapurment Mandal, Rangareddy, District- 501502.
46. The District Collector, RR District, Khairtabad, Hyderabad.
...Defendant No. 23, 42 & 46

Please take notice that, the above said plaintiff filed the above suit against you and others for Partition and Separation Possession before the Hon'ble III Addl. District Judge at LB Nagar vide O.S. No. 1/2018. The said suit is coming for your appearance on 07.07.2026.

Hence you are hereby informed to appear before the above said court on 07.07.2026 at 10.30 A.M., in person or through your counsel, failing which the matter will be decided in your absence according to law.

SCHEDULE OF PROPERTY
All that the agricultural land admeasuring Ac. 355-08 gts in Sy No. 51/1, situated at Pigilpur Village, Abdullapurmet Mandal, RR District, and bounded by:
NORTH : Boundary of Nalgonda District
SOUTH : Land in Survey No. 5 & 6 of Pigilpur village
EAST : Boundary of Nalgonda District
WEST : Deshmukh Village Border.
(By order of the Court)

M/s. S. NAGESH REDDY, Advocate
Flat no. 101 & 102, Saai Priya Apartments, Jaffar Ali Bagh, Somajiguda, Hyderabad – 500082. Ph no. 7995206678.

# రోడ్డు విస్తరణకు కూల్చివేతలు షురూ..

-రాజీవ్‌రహదారి రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం
-నష్టపరిహారం పొందిన వారి స్థలాల్లో నిర్మాణాల కూల్చివేతలు
-మేడ్చల్ జిల్లా ఎస్‌డిసిఎల్ మాలతి ఆధ్వర్యంలో కూల్చివేతలు

**శామీర్‌పేట, జూన్ 20, ప్రభాతవార్త: (మేడ్చల్ జిల్లా ప్రతినిధి)**

సికింద్రాబాద్ నుంచి శామీర్‌పేట వరకు ఎలివేటెడ్ కారిడార్ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నందున తూంకుంటలో రాజీవ్‌రహదారిన రోడ్డు వెడల్పు పనులు ప్రారంభమైనాయి. శనివారం శామీర్‌పేట మండలంలోని తూంకుంటలో రోడ్డు వెడల్పు పనులకు అధికారులు జెసిబిలతో శ్రీకారం చుట్టారు. ఎస్‌డిసిఎల్ మాలతి ఆధ్వర్యంలో హెచ్‌ఎండిఎ అధికారులు రోడ్డు వెడల్పుకోసం నిర్మాణాలను జెసిబిలు పెట్టి కూల్చివేతలు ప్రారంభించారు. శనివారం తూంకుంటలోని రాజీవ్‌రహదారిన జిల్లా అధికారి మాలతి, హెచ్‌ఎండిఎ అధికారులు, రెవెన్యూ అధికారులు పర్యటించి నిర్మాణాల కూల్చివేతలకు సేకరించిన స్థలాలను పంచనామా చేసిన విధంగా వాటిని తొలగించటానికి చర్యలు చేపట్టారు. అయితే సికింద్రాబాద్ నుంచి శామీర్‌పేట వరకు రాజీవ్‌రహదారి రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగానే తూంకుంటలోని భూనిర్వాసితులకు గతంలోనే నష్టపరిహారం అందించగా, వారు కోరినవిధంగా మూడునెలల గడువు అనంతరం ఎస్‌డిసిఎల్ వారు తూంకుంటలో సేకరించిన స్థలాన్ని పంచనామా చేసి జూన్ 6వ తేదీన హెచ్‌ఎండిఎ అధికారులకు అప్పగించారు. శనివారం ఎస్‌డిసిఎల్ మాలతి ఆధ్వర్యంలో హెచ్‌ఎండిఎ అధికారులు కూల్చివేతచర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఆమెతోపాటు హెచ్‌ఎండిఎ అధికారులు, సర్వే ల్యాండ్ సర్వేయర్ వినయ్‌కుమార్, ఆర్ఐ రాఘవ, హెచ్‌ఎండిఎ ఎఇ సంపత్, పలువురు అధికారులు పాల్గొన్నారు. ఈరోడ్డు 200ఫీట్ల వెడల్పుతో నిర్మాణపనులు చేపట్టనున్నారు. అయితే రాజీవ్ రహదారిన శామీర్‌పేటమండలంలోని హకీంపేట్, పోతాయిపల్లి, తూంకుంట గ్రామాల్లో రోడ్డు వెడల్పు కోసం భూనిర్వాసితులతో చర్చలు జరపటం, కొందరికి ఇప్పటికే నష్టపరిహారం మొదటి విడతగా పొందినవారి స్థలాల్లో ఉన్న నిర్మాణాలను కూల్చివేతలకు సంబంధిత అధికారులు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే రాజీవ్‌రహదారిన రోడ్డు పక్కన ఉన్న చెట్లను ముందుగానే తొలిగించిన సంగతి తెలిసిందే. ఇక దశలవారీగా నష్టపరిహారం పొందిన భూనిర్వాసితుల నుంచి సేకరించిన స్థలాల్లో ఉన్న నిర్మాణాల కూల్చివేతలు సంబంధిత అధికారులు చేపట్టనున్నారు.



హెచ్‌ఎండిఎ అధికారులు, ఎస్‌డిసిఎల్ మాలతి ఆధ్వర్యంలో కూల్చివేతలు ప్రారంభించిన దృశ్యం

## స్వామినారాయణ గురుకుల పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం

**కీసర, జూన్ 20, ప్రభాతవార్త:**

కీసర సర్కిల్ పరిధిలోని చీర్యాలగ్రామంలోని స్వామినారాయణ గురుకుల పాఠశాలలో శనివారం పూజ్యపాద శ్రీబ్రహ్మ స్వరూప్ స్వామీజీ, శ్రీహరిదేవ చరణ్‌స్వాముల ఆశీస్సులతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణకిషోర్, సతీష్‌కుమార్‌ల ఆధ్వర్యంలో 12వ అంతర్జాతీయ యోగాదినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా పూజ్యస్వామీజీల చేతులమీదుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం స్వామీజీ మాట్లాడుతూ ప్రపంచ యోగాదినోత్సవం సందర్భంగా యోగా అవసరం విద్యార్థులకు ఎంతో ఉందని తెలియజేశారు. బిజెపి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ ఉపసర్పంచ్ జిల్లాల తిరుమల్‌రెడ్డి మాట్లాడుతూ యోగా ప్రతిరోజు చేయడం వలన విద్యార్థుల మానసికధైర్యం పెరుగుతుందని అన్నారు. ప్రతి పాఠశాలలో యోగాను తప్పనిసరి చేయవలసిందిగా సూచించారు. ప్రధానోపాధ్యాయులు కృష్ణ కిషోర్ మాట్లాడుతూ నేటిసమాజానికి ముఖ్యంగా విద్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా ఎంతో అవసరమని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమం ఆధ్యాత్మికత, ఆరోగ్యం, భారతీయ సంస్కృతి విలువలను ప్రతిబింబిస్తూ విజయవంతంగా ముగిసింది.

## పర్మినెంట్ డిఈను నియమించాలి

-కౌన్సిలర్లు నాగారం మల్లేశం, అంతారం కిరన్



కమిషనర్‌కు మెమోరాండంను ఇస్తున్న కౌన్సిలర్లు

**పెద్దేముల్, జూన్ 20, ప్రభాతవార్త:**

తాండూరు మునిసిపల్‌లో అభివృద్ధిలో భాగమైన పనులు, ఫైల్స్ అన్ని కూడా ఆగిపోయినందున సమస్యల పరిష్కారం కోసం పర్మినెంట్ డీఈను నియమించాలని బిజెపి ఫ్లోర్‌లీడర్ 28వవార్డు కౌన్సిలర్ నాగారం మల్లేశం, 33వ వార్డు కౌన్సిలర్ అంతారం కిరన్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మునిసిపల్ కమిషనర్ పాల్వాయి రాకేష్‌రెడ్డిని కలిసి మెమోరాండంను అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పట్టణంలోని అన్నివార్డులలో నీటి సమస్య, రోడ్లు, డ్రైయిన్స్, లైటింగ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని, వాటిని పరిష్కరించాలని మెమోరాండంలో పేర్కొన్నారు.

## వర్షాకాలం నేపథ్యంలో అధికారులు సిద్ధం కావాలి

-జోనల్ కమిషనర్ చంద్రకళ




సమావేశంలో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ చంద్రకళ

**శంషాబాద్, జూన్ 20, ప్రభాతవార్త:**

వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని శంషాబాద్ జోనల్ కమిషనర్ చంద్రకళ అధికారులను ఆదేశించారు. శనివారం శంషాబాద్ జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ చంద్రకళ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సర్కిల్ పరిధిలోని వివిధ శాఖల పనితీరు, ప్రజాసేవల మెరుగుదల, వర్షాకాల సన్నద్ధతపై సమగ్ర సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ.. వర్షాకాలం నేపథ్యంలో అధికారులు సిద్ధంకావాలని వరదముప్పు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో సూపరింటెండింగ్ ఇంజనీర్ కిష్టప్ప, జాయింట్ కమిషనర్ రాజు, డిప్యూటీ కమిషనర్ సుమన్‌రావు పాల్గొన్నారు.

## ఇంటి నిర్మాణానికి సిమెంట్ పంపిణీ

**తలకొండపల్లి, జూన్ 20, ప్రభాతవార్త:**

తలకొండపల్లి మండలకేంద్రానికి చెందిన పెరుమాళ్ళ బాలమణి ఇంటి నిర్మాణంకోసం ఉప్పల చారిటబుల్‌ట్రస్ట్ నుంచి తలకొండపల్లి సర్పంచ్ కటికల శేఖర్‌యాదవ్ ఉచితంగా సిమెంటును పంపిణీచేశారు. తమ ఇంటి నిర్మాణానికి బాలమణికి ఆర్థికస్తోమత లేకపోవడంతో ఉప్పల ట్రస్ట్ నుంచి ఉచితంగా సిమెంట్ అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కోటీశ్వర్, వార్డు సభ్యులు పోతుగంటి కుమార్, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

## అంగన్‌వాడీలో బడిబాట

**తలకొండపల్లి, జూన్ 20, ప్రభాతవార్త:**

తలకొండపల్లి మండల కేంద్రంలో శనివారం అంగన్‌వాడీ కేంద్రంలో బడిబాట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన ఈ సమావేశానికి సర్పంచ్ కటికల శేఖర్‌యాదవ్ ముఖ్య అతిథిగా హాజరైనారు. అనంతరం అంగన్‌వాడీలో చేరిన బాలికలకు అక్షరాభ్యాసం నిర్వహించారు. అనంతరం వారికి పౌష్టికాహారంతో పాటు వారికి దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శేఖర్‌యాదవ్, ఉప సర్పంచ్ కోటీశ్వర్, గ్రామపంచాయతీ కార్యదర్శి సత్యం, అంగన్‌వాడీ టీచర్లు అరుణ, స్వరూప, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం...రైతులకు శాపం

-గాలులకు పొలాల్లో పడిపోయిన స్తంభాలు



ఈదురుగాలులకు పడిన విద్యుత్ స్తంభాలు

**కుల్కచర్ల, జూన్ 20, ప్రభాతవార్త:**

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. పొలాల్లో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను, తీగలను సరిచేయకుండా అలాగే వదిలేశారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమ ఇబ్బందులను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని బండవెల్కిచర్ల రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. బండలెల్కిచర్ల గ్రామ పుట్టి నర్సింలు, లాల్‌రెడ్డి పొలాల్లో 20రోజుల క్రితం ఈదురుగాలులకు సమారు 3కి పైగా విద్యుత్ స్తంభాలు మధ్యకు విరిగిపడిపోగా, మరికొన్ని పూర్తిగా పడిపోయాయి. దీంతో 20మందికి పైగా గ్రామరైతులకు చెందిన పొలాలు ఉన్నాయి. విద్యుత్ స్తంభాలు ఇలాగే పొలంలో ఉండటం, తీగలు అడ్డుగా ఉండటంతో సాగుచేసుకోవడానికి రైతులకు ఇబ్బందిగా మారింది. ప్రస్తుతం వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయి. ట్రాక్టర్లతో దుక్కులు దున్నుతున్నారు. అయితే పడిపోయిన స్తంభాలు తీగలతో ఆటంకం ఏర్పడుతోందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పడిపోయిన విద్యుత్ స్తంభాలను తొలగించాలని విద్యుత్ అధికారులకు పలుమార్లు తెలియచేసినా పట్టించుకోవడంలేదని రైతులు పేర్కొన్నారు. వెంటను విద్యుత్ అధికారులు స్పందించి బండవెల్కిచర్ల రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

## లింగరావుపల్లిలో ఘనంగా బడిబాట



అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న నాయకులు

**తలకొండపల్లి, జూన్ 20, ప్రభాతవార్త:**

తలకొండపల్లి మండల పరిధిలోని లింగరావుపల్లి గ్రామంలో శనివారం నాడు బడిబాట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలోని విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులతో కలిసి గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ బడి ఈడు పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలలో చేరాలని వేసవి సెలవుల అనంతరం బడి పున ప్రారంభోత్సవం నిర్వహించడంతో గ్రామస్థులతో కలిసి ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాల బలోపేతం కృషిచేయాలని ఈసందర్భంగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కాసు శ్రీనివాస్‌రెడ్డి, ఉపసర్పంచ్ భూత్కూరి వెంకటరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు ప్రసన్న ఆనందరావు, వార్డుసభ్యులు భాగ్యమ్మ, శ్రీజ, చింతలపల్లి సురేందర్ రెడ్డి, బాచుపల్లి శేఖర్, అంగన్‌వాడీ టీచర్ భారతి, రత్నమ్మ, సాత్విక, మహిళాసంఘం అధ్యక్షురాలు వసంతతోపాటు గ్రామస్థులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శికి సన్మానం

-తొమ్మిదిరేకుల సర్పంచ్ బిసా కవితాకరుణాకర్‌రెడ్డి



అవినాష్‌గౌడ్ సన్మానిస్తున్న సర్పంచ్ బిసా కవితాకరణాకర్‌రెడ్డి

**కేశంపేట, జూన్ 20, ప్రభాతవార్త:**

కేశంపేట మండల పరిధిలోని తొమ్మిదిరేకుల గ్రామంలో గత ఆరు సంవత్సరాల నుండి పంచాయతీ కార్యదర్శిగా విధులునిర్వహిస్తూ అందరికీ సుపరిచితుడుగా ఉంటూ శనివారం బదిలీపై వెళుతున్న సందర్భంగా పంచాయతీ కార్యదర్శి అవినాష్‌గౌడ్‌కు సర్పంచ్ బిసా కవితాకరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించి వీడ్కోలు పలికారు. అనంతరం నూతన పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన తిరుపతయ్యను శాలువాతో సన్మానించి స్వాగతం పలికారు. ఈసందర్భంగా సర్పంచ్ కవితాకరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ గత ఆరుసంవత్సరాల నుండి ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి గ్రామానికి సేవలు అందించి అందరి మన్ననలు పొందారని అన్నారు. నూతనంగా విధుల్లోచేరిన తిరుపతయ్యకూడా ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామానికి సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రవినాయక్, మాజీ ఉపసర్పంచ్ నరసింహారెడ్డి, చిట్టిరెడ్డి వెంకట్‌రెడ్డి, నాయక్, వార్డుసభ్యులు లచ్చి, రామ్‌నాయక్, పోగుల నరేష్, నరసింహులు, గుత్తి చంద్రయ్య, కందన సంతోషశివయ్య, నాగిళ్ల ప్రేమలత యాదయ్య, గుత్తి శేఖర్, శంభుల శేఖర్, చిట్టిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, లక్ష్మణ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## భద్రతాచైతన్యం పెంపొందించడమే లక్ష్యం

-రక్షణ నేత్రం-సురక్షమిత్ర కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి స్నేహ మెహ్రా



మాట్లాడుతున్న జిల్లా ఎస్‌పి స్నేహ మెహ్రా

**పెద్దేముల్, జూన్ 20, ప్రభాతవార్త:**

యువతలో భద్రత చైతన్యం పెంపొందించడమే లక్ష్యమని వికారాబాద్ జిల్లా ఎస్‌పి స్నేహ మెహ్రా అన్నారు. శనివారం తాండూరు పట్టణంలోని వినాయక కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన రక్షణ నేత్రం-సురక్ష మిత్ర అవగాహన కార్యక్రమానికి జిల్లా ఎస్‌పి స్నేహ మెహ్రా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున హాజరైన పాఠశాల, కళాశాల విద్యార్థులకు భద్రత, సైబర్‌నేరాల నివారణ, మహిళలరక్షణ, ట్రాఫిక్ నిబంధనలు, అత్యవసర పరిస్థితులలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్‌పి స్నేహ మెహ్రా మాట్లాడుతూ విద్యార్థులు సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ బస్వరాజ్, మునిసిపల్ చైర్‌పర్సన్ నీరజా బాల్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ పాల్వాయి రాకేష్‌రెడ్డి, కౌన్సిలర్లు జుంటుపల్లి వెంకట్, దివిటి ఎల్లప్ప, తాండూరు డిఎస్‌సి నర్సింగ్ యాదయ్య, పట్టణ సిఐ పరమేష్, ఎస్‌ఐలు విఠల్‌రెడ్డి, సుమన్ అలీ, వినోద్ రాథోడ్, ప్రశాంత్‌వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటు ప్రతి ఒక్కరి జన్మ హక్కు

-కాంగ్రెస్ సత్యాగ్రహ దీక్షకు కేశంపేట మండలం నుంచి సంఘీభావం




సత్యాగ్రహ దీక్షలో పాల్గొన్న మండల కాంగ్రెస్ నేతలు

**కేశంపేట, జూన్ 20, ప్రభాతవార్త:**

ఓటు ప్రతి ఒక్కరి జన్మ హక్కు గౌతమి వినియోగించుకునే హక్కు ప్రతి ఒక్కరికి ఉంటుందని కాంగ్రెస్ పార్టీ కేశంపేట మండలాధ్యక్షుడు అనుమగళ్ళ రమేష్ అన్నారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపుమేరకు తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మీనాక్షీనటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణను నిరసిస్తూ శనివారం గాంధీభవన్‌లో నిర్వహించిన సత్యాగ్రహ దీక్షలో కేశంపేట మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపామని కాంగ్రెస్ పార్టీ కేశంపేట మండల అధ్యక్షుడు రమేష్ తెలిపారు. ఈసందర్భంగా రమేష్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడం ప్రతిపౌరుడి బాధ్యత అని, ఓటు హక్కును బలహీనపరిచే కుట్రలను కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ సహించదని స్పష్టంచేశారు. కార్యక్రమంలో బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షులు పట్లూరి జగదీశ్వర్, మాజీ జడ్పీటీసి విశాలశ్రవణ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్, మాజీ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి, మల్లేష్, తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా పకడ్బందీగా ఉండాలి

-తహసీల్దార్ సాజిదాబేగం



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సాజిదాబేగం

**ధారూర్, జూన్ 20, ప్రభాతవార్త:**

జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ఆదేశాల మేరకు ధారూర్ మండల పరిధిలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (2026)పై శిక్షణ కార్యక్రమం జరిగింది. స్థానిక స్త్రీశక్తి భవనంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండలస్థాయి, బూత్‌లెవల్ ఆఫీసర్లు, బూత్‌లెవల్ ఏజెంట్లు, సూపర్వైజర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సాజిదాబేగం మాట్లాడుతూ, భారత ఎన్నికలసంఘం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను ఎంతో బాధ్యతతో నిర్వహించాలని సూచించారు. ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు నమోదు అయ్యేలా అధికారులు పకడ్బందీగా పనిచేయాలని, ఓటరు జాబితా సవరణలో పారదర్శకత పాటించాలని, నిర్ణీత గడువులోగా ప్రక్రియను పూర్తిచేయాలని స్పష్టంచేశారు.

## దాతల సేవాభావం అభినందనీయం..

-తహసీల్దార్ వెంకటేష్‌ప్రసాద్



రోడ్డుకు ఇరువైపుల మట్టి పోయిస్తున్న తహసీల్దార్

**పెద్దేముల్, జూన్ 20, ప్రభాతవార్త:**

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వంతో పాటు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని పెద్దేముల్ తహసిల్దార్ వెంకటేష్ ప్రసాద్ అన్నారు. పెద్దేముల్ మండలం ఆత్కూర్ నుంచిఎర్రగడ్డతాండా వరకు రోడ్డుకు ఇరువైపుల గుంతలు ఏర్పడి ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలుగుతుండటంతో స్పందించిన పెద్దేముల్ తహసిల్దార్ వెంకటేష్ ప్రసాద్ దాతల సహకారంతో మట్టి పోయించి సమస్య పరిష్కారానికి నడుం బిగించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ వెంకటేష్ ప్రసాద్ మాట్లాడుతూ తమ సామాజిక భాధ్యతను గుర్తించి రహదారి మరమ్మతులకు మట్టి వేయించిన దాతల సేవాభావం అభినందనీయమని అన్నారు. ఈ సహకారం వల్ల ప్రయాణికుల భద్రత మెరుగుపడుతుందని అన్నారు. ప్రజాసమస్యల పరిష్కారంలో ప్రజలు, దాతలు, ప్రభుత్వ యంత్రాంగం కలిసి పనిచేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని అన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా ఇలాంటి సహకారం అందించేందుకు మానవత దృక్పతంతో దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమాజసేవలో భాగస్వాములు అయ్యేందుకు ప్రతిఒక్కరు సన్నద్ధం కావాలని అన్నారు. ఆయన వెంట ఎర్రగడ్డతాండా, తట్టెపల్లి, ఓంలనాయక్‌తాండా సర్పంచ్‌లు కాంతాబాయి, నారాయన్‌గౌడ్, సుమిత్ర రాథోడ్, ఉపసర్పంచ్ శోభా జగన్, నాయకులు తట్టెపల్లి నర్సిములు, ఎర్రగడ్డతాండా నారాయణ, కీరాసింగ్ తదితరులు ఉన్నారు.

## గ్రామీణప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

-ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి చాకలి అనిల్



డిఈఓకు వినతిపత్రం అందిస్తున్న జిల్లా సహాయ కార్యదర్శి

**కొడంగల్, జూన్ 20, ప్రభాతవార్త:**

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేలా చర్యలు తీసుకోవాలని, చిచ్చాల్‌గ్రామ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత వెంటనే తీర్చాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి చాకలి అశోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఎస్ఎఫ్ఐ నాయకులతో కలిసి జిల్లా విద్యాధికారికి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దౌల్తాబాద్ మండలంలోని బిచ్చాల్ గ్రామంలోని జడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్ పాఠశాలతోపాటు అనేకపాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందన్నారు. బిచ్చాల్ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయపోస్టులను వెంటనే భర్తీచేయాలని, అవసరమైతే అదనపు ఉపాధ్యాయులను తాత్కాలికంగా నియమించాలని, విద్యార్థులకు ఎలాంటి అటంకం కలుగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని జిల్లా విద్యాశాఖ తక్షణచర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ దీప, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## సేవాకార్యక్రమం అభినందనీయం

మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు

**కుల్కచర్ల, జూన్ 20, ప్రభాతవార్త:**

స్వామన్నసైన్యం ఆధ్వర్యంలో సేవాకార్యక్రమాలు చేయడం అభినందనీయమని మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులుముదిరాజ్ అన్నారు. శనివారం కుమ్మరిస్వామి జన్మదినం సందర్భంగా కుల్కచర్ల మండలంలోని ప్రభుత్వం పాఠశాలలో పదవతరగతి చదువుతున్న ప్రతివిద్యార్థికి ప్యాడ్‌లతోపాటు కంపాక్స్‌లు పంపిణీచేశారు. ఈసందర్భంగా కుమ్మరిస్వామి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుపై దృష్టిసారించి ఉన్నతస్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రభూపాల్‌రావు, బండవెల్కిచర్లసర్పంచ్ మడుగు శ్రీనివాస్, స్వామన్నసైన్యం, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

-డైవర్షన్ పాలిటిక్స్‌తో కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన
-ఆరుట్ల పాఠశాలకు రంగులద్ది ప్రచారం చేసుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం
-రంగారెడ్డి జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

**ఇబ్రహీంపట్నం, జూన్ 20, ప్రభాతవార్త:**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు కావస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని రంగారెడ్డి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తీవ్రంగా విమర్శించారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ప్రజల దృష్టి మళ్లించేందుకే గత బిఆర్ఎస్‌ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. శనివారం ఆయన పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణరాష్ట్రం ఏర్పడిన తర్వాత మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ నాయకత్వంలో వ్యవసాయం, సాగునీరు, తాగునీరు, విద్యుత్, సంక్షేమం, పారిశ్రామిక రంగాల్లో దేశానికే ఆదర్శంగా నిలిచిందని మంచిరెడ్డి పేర్కొన్నారు. పదేళ్లపాటు తెలంగాణను అభివృద్ధిపథంలో నడిపించిన బిఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం ద్వారా కాంగ్రెస్ తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తోందన్నారు. రైతు సంక్షేమానికి బిఆర్ఎస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇచ్చిందని, రైతుబంధు పథకం ద్వారా 72లక్షలమంది రైతులకు పెట్టుబడి సాయం అందించామని అదేవిధంగా రైతు బీమా పథకం ద్వారా వేలాది రైతుకుటుంబాలకు భరోసా కల్పించామని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుభరోసా అమలులో స్పష్టతలేకుండా వ్యవహరిస్తూ రైతులను అయోమయానికి గురిచేస్తోందని కిషన్‌రెడ్డి విమర్శించారు. రైతులకు ఇచ్చిన రుణమాఫీ హామీని పూర్తిగా అమలుచేయకుండా అనేక నిబంధనలు పెట్టి రైతులను మోసంచేసిందన్నారు. ఎన్నికల ముందు చెప్పిన మాటలకు అధికారంలోకి వచ్చిన తర్వాత చేస్తున్నపనులకు పొంతనలేకుండా పోయిందని మండిపడ్డారు. కృష్ణాజలాల విషయంలో రాష్ట్ర ప్రయోజనాలను కాపాడడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయకుండా ప్రతిపక్షాలపై విమర్శలుచేయడం మానుకొని, పాలనపై దృష్టిసారించాలని సూచించారు. తెలంగాణ ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికోసం బిఆర్ఎస్ నిరంతరం ప్రజలపక్షాన పోరాటం కొనసాగిస్తుందని స్పష్టంచేశారు.

**పాఠశాలకురంగులేసి తామే కట్టామంటున్నారు...**

ఈ నెల 17వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతులమీదుగా ప్రారంభించిన ఆరుట్ల మోడల్ స్కూల్‌ను నిర్మించింది కెసిఆర్ ప్రభుత్వమేనని మంచిరెడ్డి కిషన్‌రెడ్డి స్పష్టంచేశారు. ఉన్న పాఠశాలకు రంగులువేసి తామే కొత్తగా కట్టించినట్టు కాంగ్రెస్‌నేతలు ప్రచారంచేసుకోవడం హాస్యాస్పదమన్నారు. ఇప్పటికే నాలుగుసార్లు నియోజకవర్గానికి విచ్చేసిన ముఖ్యమంత్రి ఇక్కడికి ఎన్నినిధులు కేటాయించారో చెప్పాలని డిమాండ్‌చేశారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే నియోజకవర్గం కోసం ఎన్ని నిధులు అడిగారో కూడా నిరూపించాలన్నారు. నియోజకవర్గంలోనే పెద్ద గ్రామమైన ఆరుట్లకు నిధులు కేటాయించాలని సర్పంచ్ వినతిపత్రమివ్వగా దాన్ని పక్కనపెట్టడం సరికాదన్నారు. పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధి పనిచేయాలని హితవు పలికారు. కేవలం మంత్రిపదవి ఆశతో గ్రామాల అభివృద్ధిని పక్కనపెట్టడం సరికాదని స్థానిక ఎమ్మెల్యే తీరును కిషన్‌రెడ్డి తీవ్రంగా తప్పుపట్టారు. సమావేశంలో ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారంమండలపార్టీ అధ్యక్షులు చిలుకల బుగ్గరాములు, చీరాల రమేష్, కర్నాటి రమేష్‌గౌడ్, ఇబ్రహీంపట్నం మున్సిపల్‌పార్టీ అధ్యక్షులు అల్వాల వెంకటరెడ్డి, మాజీఎంపిపి కృపేష్, రైతుబంధు జిల్లా మాజీ అధ్యక్షులు వంగేటి లక్ష్మారెడ్డి, నాయకులు అంజిరెడ్డి, మడుపు వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.